క్లుప్తంగా

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి సోమవారం ఓ భక్తుడు రూ. 51,116 విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. రొడూరు గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి కుటుంబ సభ్యులు రూ.51,116 దేవాలయ కార్యాలయంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, చిత్రం పటం, శేష వస్త్రం, బాండ్ అందజేశారు.

ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్ : ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీపై విచారణ చేపట్టని ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ (ఆర్‌పీఎస్‌ఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి బాలు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారి గోవిందసింగ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడతూ ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో జరుగుతున్న అధిక ఫీజులపై చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పుస్తకాలను అమ్ముతున్నారని, నర్సరీ నుంచి పదో తరగతి వరకు రూ.20 వేల వరకు దండుకుంటున్నారని ఆరోపించారు. డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్, సహాయ కార్యదర్శి హరికృష్ణ, వంశీ, అర్జున్, రవి పాల్గొన్నారు.

వెండి నాగాభరణం విరాళం



వెండి నాగాభరణాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

కోసిగి: స్థానిక శ్రీ ఈశ్వర దేవాలయంలో వెలసిన ఈశ్వరుడికి కె.ఆర్.పరమేష్, దంపతులు వెండి నాగాభరణాన్ని అందజేశారు. సోమవారం శ్రావణ పంచమి సందర్భంగా ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకు పూజ, మహా మంగళ హారతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అంతకు ముందుగా దాత కుటుంబ సమేతంగా ఇంటి నుంచి 1311 గ్రాముల బరువైన నాగాభరణంను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేసి స్వామి వారికి బహూకరించారు. అనంతరం భక్తాదులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బదినేహాల్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



వంకలో పూడికతీత పనులు చేపట్టిన దృశ్యం

కౌతాళం: మండలంలోని బదినేహాల్ గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సోమవారం గ్రామ సమీపంలోనున్న వంకలో పూడికతీత పనులు చేపట్టారు. వర్షాకాలంలో వంక నీరు ఇళ్లల్లోకి వస్తుందని గ్రామస్తులు పేర్కొనడంతో పనులు చేపట్టారు. గ్రామంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని సర్పంచ్ ఎన్నికల సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే వంకలో పూడిక తీత పనులు చేపట్టినట్లు సర్పంచ్ పెద్దనర్సప్ప, ఉప సర్పంచ్ ప్రసన్నగౌడ్, వీరభద్రగౌడ్, రవిగౌడ్, వినోద్‌రెడ్డి తెలిపారు.

రణమండల ఆంజనేయస్వామి సేవలో..



పూజల్లో పాల్గొన్న డీఎస్పీ శివనారాయణ స్వామి, సీఐ విక్రమసింహ

ఆదోనిఅర్బన్ : పట్టణ శివారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయ స్వామి వారిని డీఎస్పీ శివనారాయణస్వామి, వన్ టౌన్ సీఐ విక్రమసింహ మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ నిర్వాహకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సన్మానం చేసి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం కొండ ప్రాంతంలో కలియతిరిగి శ్రావణమాసంలో భక్తులు రద్దీ, సౌకర్యాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిరూరల్ : పట్టణంలోని బోయగేరికి చెందిన రాజు కర్ణాటక నుంచి మద్యం తీసుకొస్తుండగా స్థానిక ఎన్‌డీబీఎల్ ఫ్యాక్టరీ వద్ద అరెస్టు చేసినట్లు ఇస్పీ ఎస్ఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. రాజు సంచిలో 288 టెట్రా ప్యాకెట్లను ఉంచుకొని నడుచుకుంటూ వస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకుని మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

108.. ఆపత్కాల సమయంలో మనుషుల ఆదుకునేందుకు ఆపద్బాంధవుడిలా సేవలం దిస్తోంది. అత్యవసర సమయంలో ఫోన్ చేసిన వెంటనే సంఘటనా స్థలం చేరుకొని బాధితులకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం సమీపంలోని ఆసుపత్రులకు తరలించి ప్రాణాలు కాపాడుతుండటంతో అపర సంజీవనిగా పేరుగాంచింది. ఇలాంటి సేవలే పశువులకు కూడా అందజేయాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంచార పశువైద్య వాహనం ఏర్పాటు చేసింది. 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే..ఇందులో వివిధ రకాల మందులు, వైద్య సిబ్బంది ఉండి ఇంటి వద్దకే వచ్చి పశువుకు చికిత్స చేస్తారు. మెరుగైన వైద్యం అవసరమైతే సమీపంలోని పశువుల ఆసుపత్రికి అదే వాహనంలో తరలించి చికిత్స అనంతరం ఇంటి వద్దకు వచ్చి వదులుతున్నారు.



ఆదోని మండలంలోని డణాపురం గ్రామంలో రైతు ఆంజనేయులుకు జత ఎద్దులు ఉన్నాయి. ఇటీవల అందులో ఓ ఎద్దుకు నాలుగురోజులుగా విడవకుండా బేదులు అవుతుండటంతో పాటు కదు పునొప్పితో మేత వేయలేదు. దీంతో సొంత వైద్యంతో పాటు తెలిసిన వైద్యుల ద్వారా మందులు వేసినా ఫలితం లేకపోయింది. చివరకు ఐదో రోజు 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. గంట వ్యవధిలో సంచార పశువైద్య వాహనం ఇంటి ముందు వాలిపోయింది. వైద్య సిబ్బంది ఎద్దును పరిశీలించి చికిత్స చేశారు. సాయంత్రానికి మేత మేయడంతో పాటు జబ్బు నయమైంది. ప్రస్తుతం ఎద్దుతో సేద్యం పనులు చేసుకుంటున్నాడు.

పశు సంరక్షణకు పెద్ద పీట

- పశు సంచార వాహనం ద్వారా ఇంటి వద్దకే పశు వైద్యం
- పశుబీమా ద్వారా పాడి రైతులకు అండగా ప్రభుత్వం
- 80 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాల పంపిణీ
- సంపూర్ణ పోషణలో భాగంగా మిశ్రమ దాణా సరఫరా



ఓబుళాపురం గ్రామంలో ఆవును సంచార పశువైద్య వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

వైఎస్సార్ పశు వైద్య సంచార వాహనం ద్వారా ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు అందిన వైద్య సేవలు..

కేంద్రం	ఏప్రిల్	మే	జూన్	జూలై	ఆగస్టు
ఆదోని	171	207	278	162	142
ఆలూరు	191	178	58	186	64
అస్పరి	131	169	188	173	118
కోడుమూరు	75	174	106	136	130
గూడూరు	108	255	182	176	95
కర్నూలు	135	339	237	278	136
మంత్రాలయం	93	150	130	105	66
కోసిగి	111	146	198	190	73
ఓర్వకల్లు	111	125	109	118	68
పత్తికొండ	430	204	244	184	275
మద్దికెర	85	113	152	165	73
కృష్ణగిరి	271	355	453	268	77
ఎమ్మిగనూరు	104	119	138	175	67
గోనెగండ్ల	98	448	585	156	250

ఆదోని సెంట్రల్: పశు ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పెద్ద పీట వేసింది. పాడి రైతుల్లో జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుంది. గ్రామాల్లోనే పాడి రైతుల ముంగిటకు నాణ్యమైన పశు వైద్య సేవలను అందించడానికి ప్రతి సచివాలయంలో పశు సంవర్ధక సహాయకుడు, వెటర్నరీ అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి వైద్య సేవలను అందిస్తుంది.

14 సంచార పశు వైద్య వాహనాలు..

జిల్లాలో 2 లక్షల బర్రెలు, 1.50 లక్షల ఎద్దులు,ఆవులు, 12 లక్షల మేకలు, గొర్రెలు ఉన్నాయి. ఆదోని డివిజన్‌లో 5,82,000 వేలు గొర్రెలు, మేకలు, 1.20 లక్షల బర్రెలు, 80 వేలు ఎద్దులు, ఆవులు ఉన్నాయి. రెండు మండలాలకు ఒక వెటర్నరీ అంబులెన్స్ వైఎస్సార్ పశు వైద్య సంచార వాహనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లాలో ఆదోని, ఆలూరు, అస్పరి, కోడుమూరు, గుడూరు, కర్నూలు, మంత్రాలయం, కోసిగి, ఓర్వకల్లు, పత్తికొండ,మదిరె, క్రిష్ణగిరి, ఎమ్మిగనూరు, గోనేగొండ్ల వంటి ప్రాంతాలకు 14 అంబులెన్సులను అందజేసింది. వీటిలో ఒక డాక్టరు, సహాయకుడు, పైలెట్ ఉంటారు. 46 రకాల మందులు, సిరప్స్, పౌడర్లు, వివిధ రకాల వైద్య పరీక్షలు చేసేందుకు అవసరమైన పరికరాలు ఉంటాయి. పశువుకు బాగా లేని సమయంలో రైతులు 1962 నంబర్‌కు కాల్ చేస్తే రైతు ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలను అందిస్తున్నారు. ప్రతి ఆర్బీకే సెంటర్‌లో ఒక పశు సంవర్ధక సహాకున్ని ప్రభుత్వం నియమించింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 81 సహాయకులుగా పనిచేస్తున్నారు. జనవరి నుంచి ఆగస్టు వరకు పశు వైద్య సంచారం ద్వారా 25,942 పశువులకు వైద్య సేవలను అందించారు. గతంలో పశువులకు వైద్యం చేయించాలంటే మండల కేంద్రాలకు వాటిని తీసుకొని వచ్చి వైద్యం చేయించాల్సిన పరిస్థితి ఉండింది. అత్యవసరమైతే గ్రామాల్లో ప్రైవేట్ పశు వైద్య సహాయకులను సంప్రదించాల్సి వచ్చేది.

పశు పోషణకు ఇలా..

పాడి రైతులకు మేలు చేకూర్చేలా 80 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను ప్రభుత్వం అందిస్తుంది. ఆర్బీకేల ద్వారా సర్టిపై చేసిన నాణ్యమైన సంపూర్ణ పోషణ మిశ్రమ దాణా పంపిణీ చేస్తుంది. పశువులలో పాల ఉత్పత్తిని మెరుగు పరుచుకోవడానికి రైతులకు అవగాహన కార్యక్రమాలను చేపడుతుంది. పాడి రైతులు పశువును కోల్పోతే ఆదుకునేందుకు పశుబీమా పథకం అమలు చేస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు 7,100 మంది రైతుల ద్వారా పశుబీమా చేయించారు. అలాగే పశువులకు గొర్రెలకు నట్టల నివారణ మందులతో పాటు ఉచితంగా టీకాలు వేస్తున్నారు. ప్రతి పశు వైద్య కేంద్రాల్లో మలం, రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేసి వైద్య సేవలను అందించేందుకు అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచింది.

వైద్య సేవలు అందిస్తున్నాం



వైఎస్సార్ పశు వైద్య సంచార వాహనానికి కాల్ చేసిన వెంటనే సంబంధిత ప్రాంతానికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నాం. అత్యవసర పరిస్థితి ఉంటే దగ్గరలోనే పశు వైద్య కేంద్రానికి తరలించి స్థానిక వైద్యులతో చికిత్స అందేలా ఏర్పాట్లు చేస్తాం. పశువులను అంబులెన్స్‌లో తరలించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. చాలా మంది రైతులు ఈ వాహన సేవలను వినియోగించుకుంటున్నారు.

– డాక్టరు అనూష, అంబులెన్స్ వైద్యురాలు

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం పాడి రైతులకు మేలు చేకూర్చేలా ఆర్బీకేల ద్వారా సంపూర్ణ పశుపోషణ మిశ్రమ దాణాను సరఫరా చేస్తుంది. సబ్సిడీ కింద పశుగ్రాస విత్తనాలను కూడా అందజేస్తుంది. పశువులకు అనారోగ్యం చేకూరితే ఇంటికే వచ్చి వైద్యం అందించేందుకు వైఎస్సార్ పశువైద్య సంచార వాహనం ఏర్పాటు చేసింది. ప్రభుత్వం కల్పిస్తున్న సేవలను వినియోగించుకోవాలి.

– పి.వి.రమణ, పశుసంవర్ధక శాఖ డీడీ

బసాపురం ట్యాంకు పరిస్థితిని సీఎం దృష్టికి తీసుకెళ్తా



కుంగిన సీసీ లైనింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, అధికారులు

ఆదోనిటౌన్ : పట్టణానికి తాగునీటిని అందించే బసాపురం ఎస్ఎస్ ట్యాంకు పరిస్థితిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్ఎస్ ట్యాంకు సీసీ లైనింగ్ కుంగిపోవడంతో గట్టుకు ముప్పు వాటిల్లిందని, అత్యవసర మరమ్మతుల కోసం రూ.10 కోట్లు మంజూరు చేయాలని సీఎంను కలిసి కోరతానని చెప్పారు. సోమవారం చైర్‌పర్సన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, వైస్ చైర్మన్ గౌస్, కౌన్సిలర్లు సురేష్, రామలింగేశ్వరయాదవ్, కామాక్షి తిమ్మప్పతో పాటు నాయకులు కుంగిన చెరువుగట్టును పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..15 యేళ్ల క్రితం ఎస్ఎస్ ట్యాంకును నిర్మించారని, అయితే చెరువు గట్టు లోపల భాగంలో నిర్మించిన సీసీ లైనింగ్ పూర్తిగా దెబ్బతిందన్నారు. అత్యవసరంగా దాదాపు 500 మీటర్ల మేర మరమ్మతు చేయాల్సి ఉందన్నారు. సమస్యను గత నెలలో ఆదోని, ఆలూరు నియోజకవర్గాల అభివృద్ధిపై జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్, సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రస్తుతం తుంగభద్ర దిగువ కాలువ ద్వారా నీటిని చెరువులోకి పంపింగ్ చేస్తున్నారన్నారు. మట్టి కుంగిపోవడం వల్లనే సీసీ లైనింగ్ దెబ్బతినిందని ఎంఈ నాగభూషణ్‌రెడ్డి తెలిపారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

కోసిగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు కళాశాలలో చేరి అడ్మిషన్ల పొందిన విద్యార్థులకు నేటి వరకు ఆన్‌లైన్, అటెండెన్స్‌లో పేర్లు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ తాలుకా అధ్యక్షుడు వీరేష్ కోరారు. సోమవారం కళాశాలలో విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో కొందరు విద్యార్థులు మాట్లాడుతూ రోజూ కళాశాలకు వస్తున్నామని, అటెండెన్స్‌లో పేర్లు లేవని చెప్పారు. ఈ మేరకు సమస్యను ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లగా..ఆయన సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆయన చర్యల కారణంగా దాదాపు 20-30 మంది విద్యార్థుల పేర్లు నమోదు కాలేదని మండిపడ్డారు. నరసింహులు, నాయుడు, భాస్కర్, లక్ష్మన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పెద్దకడబూరు : మండలంలో ఖాళీగా ఉన్న 7వలంటీర్ల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పెద్దకడబూరు పంచాయతీ -1, హెచ్. మురవణి -1, దొడ్డిమేకల -1, చిన్నతుంబళం -1, తారాపురం -2, కల్లుకుంటలో -1 మొత్తం 7పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నుంచి గురువారం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, ఈనెల 25న దరఖాస్తులను పరిశీలించి 26న ఇంటర్వ్యూలు, 28న ఎంపికైన వలంటీర్ల వివరాలను వెల్లడిస్తామని చెప్పారు.

30న ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ తరగతులు నిర్వహించి 31వ తేదీ నుంచి విధుల్లో చేరాల్సి ఉంటుందని వివరించారు.

సంక్షిప్తం

నేటి నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'

పెద్దకడబూరు : మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొంటారని, మండల స్థాయి అధికారులు, స్థానిక సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పాల్గొనాలని కోరారు.

ఆధార్ క్యాంప్‌లను వినియోగించుకోండి

పెద్దకడబూరు : మండలంలో నేటి నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే ఆధార్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన మండలంలోని హెచ్.మురవణి -1 సచివాలయం, మేకడోణ, దొడ్డిమేకల, 23న హెచ్. మురవణి -2, కల్లుకుంట, నాలేకల్లు, 24న జాలవాడి, పీకలబెట్ట, బసలదొడ్డి, 25న హనుమాపురం, కంబలదిన్నె, గవిగట్టు గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లోని చిన్నపిల్లల నూతన ఆధార్‌కార్డు, కార్డుల్లో తప్పులు దొర్లిన వారు సరిచేసుకోవాలన్నారు.

నిధులను జమ చేయాలి

ఆదోనిరూరల్ : ప్రభుత్వాలు వాడుకున్న బీఓసీ నిధులను సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బోర్డుకు జమ చేయాలని ఏపీ ప్రగతిశీల భవన కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. నాడు చంద్రన్నబీమా పేరుతో టీడీపీ ప్రభుత్వం భవన కార్మికులకు ఇచ్చే సంక్షేమ పథకాలను రద్దు చేసి నిధులను పక్కదారి మళ్లించిందని, అలా దారి మళ్లిన నిధులను వెంటనే బోర్డుకు జమచేయాలని కోరారు. నాయకులు ప్రసాద్, వెంకప్ప, ఏపీ ప్రగతిశీల భవన నిర్మాణ సంఘం నాయకులు బి.ఈరన్న, వలమన్న, జి.ఈరన్న, నరసింహులు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించండి

కోసిగి: మండలంలోని దొడ్డి ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు రాము, గోపాల్, వీరేష్, శ్యాంసుందర్, రంగారెడ్డి, పాండురంగా తదితరులు కోరారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ-2 నాగేశప్పను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామ ప్రాథమిక పాఠశాలలో 1-5వ తరగతి వరకు 198 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారికి ఒకే ఒక టీచర్ ఉన్నారని, దీంతో విద్యార్థులకు బోధన అందడం లేదన్నారు. స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మంత్రాలయం రూరల్: కోసిగి మండలం దొడ్డిబెళగల్ గ్రామానికి చెందిన కురువ నాగిరెడ్డి మాధవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం గ్రామం నుంచి కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన గిల్కెసూగూరు గ్రామానికి పనిపై ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. మాధవరం పాఠశాల దగ్గరకు రాగానే కుక్క అడ్డురాగా.. తప్పించే క్రమంలో అదుతప్పి కిందపడ్డాడు. దీంతో రోడ్డుకు తల బలంగా తాకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాధవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆదోనిరూరల్ : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గీతావాణి సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ..ఎంపీపీ దానమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో వివిధ అంశాలపై చర్చ జరుగుతుందని చెప్పారు. ఆయా శాఖ అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో రావాలని సూచించారు. ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పీటీసీలు హాజరు కావాలని కోరారు.

బీమా తక్షణ సాయం అందజేత

మంత్రాలయం: మండల కేంద్రంలోని పాతవూరులో నివాసముంటున్న దుల్లయ్య ఈనెల 18న అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా నామిని అయితన లక్ష్మికి రూ.10 వేల నగదును సోమవారం సర్పంచ్ తెల్ల బండ్లభీమయ్య అందజేశారు. మిగిలిన సొమ్మును నామినీ ఖాతాల్లో జమ చేస్తారని చెప్పారు.కార్యక్రమంలో వెల్ఫేర్ అధికారి ప్రకాష్, వలంటీర్ వెంకటేష్, నాయకుడు వీరేష్ ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలను వింటున్న పరిపాలనాధికారి గోవిందసింగ్

ఆదోని రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యమొద్దని వెంటనే పరిష్కారం చూపాలని ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి గోవిందసింగ్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, బీసీ వెల్ఫేర్ లక్ష్మీనారాయణ, వ్యవసాయ శాఖ ఏడీఏ గిరీష్‌కుమార్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పందనలో అర్జీల ద్వారా వచ్చిన సమస్యల్లో కొన్ని..

- ఆదోని మండలం గణేకల్ గ్రామానికి చెందిన రాముడికి సర్వే నంబర్ 151/బీలో 60 సెంట్లు భూమి ఉంది. భూమిని ఆన్‌లైన్‌లో తమ పేరున నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.
- నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన నల్లబోతుల బజారికి సర్వే నంబర్ 282లో 3.95 ఎకరాల భూమి కోర్టు పరిధిలో ఉందని, ఈ భూమి క్రయ, విక్రయాలు జరగకుండా ఆన్‌లైన్‌లో డిస్ప్యూట్ నమోదు చేయాలని అర్జీ అందజేశాడు.
- నందవరం మండలం పులిచింతల గ్రామానికి చెందిన ఉల్లిగడ్డల జేమ్స్‌కు సర్వేనంబర్ 910/ఏలో 2.90 ఎకరాలు భూమి ఉండగా, ఆన్‌లైన్‌లో 1.97 ఎకరాల భూమి మాత్రమే చూపుతోందని, మిగిలిన 93 సెంట్లు భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు.
- ఎమ్మిగనూరు మండలం మల్కాపురం గ్రామానికి చెందిన మహారాజ గౌడ్‌కు సర్వేనంబర్ 25/బీ2ఏలో ఐదు ఎకరాల భూమి ఉండగా కేవలం 1.28 ఎకరాల భూమి మాత్రమే ఆన్‌లైన్‌లో చూపిస్తుందని, మిగిలిన 3.27 ఎకరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ అందజేశాడు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

కోసిగి: మండలంలోని నాగుల పంచమి వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఆంజనేయ స్వామి, ఈశ్వర దేవాలయం, మార్కండేయ స్వామి దేవాలయాలతో పాటు పలు ప్రాంతాల్లో వెలసిన నాగదేవతల విగ్రహాలు, పుట్ట వద్ద భక్తులు వద్ద పాలు పోసి, నైవేద్యం సమర్పించి పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు.

తక్షణమే సమస్యల పరిష్కారం

ఆదోనిటౌన్ : స్పందన ద్వారా సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ వార్డులకు చెందిన ప్రజలు అర్జీలు అందజేశారు. తాగునీటి సరఫరాలో కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇద్దరు, వీధిలైట్లు వెలగడంలేదని బావోజీపేటకు చెందిన లక్ష్మన్న, వీధిలైట్లు కొన్ని వెలగడంలేదని, కొన్ని రాత్రింబవళ్లు వెలుగుతూనే ఉన్నాయని ఆన్ అండ్ ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారంటూ మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమకు వివరించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతామని అధికారులు వారికి హామీనిచ్చారు.

ముమ్మరంగా ఇళ్ల నిర్మాణాలు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాలనీలో 9,327 ప్లాట్లను లబ్ధిదారులకు అందజేయగా అందులో మొదటి విడత కింద 5,101 ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అందులో 110 ఇళ్లు టాప్ పూర్తి చేసుకోగా 51 ఇళ్లు రూఫ్ లెవల్‌లో, 46 ఇళ్లు లెంటల్ లెవల్‌లో ఉన్నాయి. 4894 ఇళ్లు ప్లింత్ భీమ్, బేస్‌మట్టం, కిటికీల స్థాయిలో పనులు సాగుతున్నాయి. నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ రవికుమార్ లబ్ధిదారులకు సూచించారు. అవసరమైతే లేబర్‌ను ఎక్కువ మందిని పెట్టి చేయించుకోవాలని కోరారు.

మానసికంగా ధృడంగా ఉండాలి

ఆదోనిఅర్బన్ : వృద్ధులు మానసికంగా ధృడంగా ఉండాలని, నిద్రలేమి నుంచి ఎలా బయటపడాలో డాక్టర్ చైతన్యకుమార్ అవగాహన కల్పించారు. ఆదోని-ఆస్పరి రోడ్డులోని జీవనజ్యోతి ఆశ్రమంలో సోమవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ వయస్సులో వృద్ధులు ఎక్కువగా ఒంటరితనంలో డిప్రెషన్‌కి గురవుతారన్నారు. మానసిక ఒత్తిడి నుంచి ఎలా బయటపడాలో కౌన్సెలింగ్ ఇచ్చారు.

సంతాపం

మంత్రాలయం రూరల్: డీటీఎఫ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మృతిపట్ల మంత్రాలయం మండల శాఖ సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోట్ల చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి రామన్న మాట్లాడుతూ లక్ష్మారెడ్డి మృతి ఉపాధ్యాయులకు తీరని లోటన్నారు. మండల నాయకులు శివశంకర్, గుమ్మ శీను, వెంకటేశులు, ఈశ్వర్‌రెడ్డి, కుముద్వతి ఉన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



స్వామి మూలవిరాట్‌కు సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

ఘనంగా కలశ ప్రతిష్ఠ

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి విరాళంగా ఇచ్చిన బంగారు కలశాలను సోమవారం తెల్లవారుజామున వివిధ పూజల అనంతరం ప్రతిష్ఠించారు. స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు వివిధ రకాల పానీయాలు, తులసీ శుద్ధ జలలాతో, పసుపు, గంధంతో సంప్రోక్షణ అనంతరం స్వామి వారి మకర తోరణం పై మూడు బంగారు కలశాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, పర్యవేక్షకులు రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

ఈరన్నస్వామి సన్నిధిలో..

ఉరుకుంద ఈరన్నస్వామిని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఆయనకు అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఉత్సవాల ప్రత్యేక అధికారి రామాంజినేయులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్‌తో మాట్లాడుతూ.. భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఆలయ పర్యవేక్షులు రామ్మోహన్, మల్లికార్జున, వేంకటేష్ పాల్గొన్నారు.

స్థాయి తెలుసుకొని విమర్శించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిటౌన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి ఆదోని ముస్లిం మైనార్టీ నాయకుడు ఉమ్మి సలీంకు లేదని పార్టీ శ్రేణులు అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ నియాజ్ అహ్మద్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మాబాషా, ఆర్టీసీ రహమాన్, రిటైర్డ్ ఎస్ఐ రహమాన్, పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, అధ్యక్షుడు దేవా మాట్లాడారు. ముస్లిం హక్కుల పరిరక్షణ చైతన్య సదస్సులో ఉమ్మి సలీం శనివారం చేసిన అనుచిత వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆదర్శంగా పరిపాలన చేస్తున్న సీఎంను విమర్శించడం తగదన్నారు. గతంలో ముస్లింల అభివృద్ధి కోసం 12 శాతం రిజర్వేషన్‌ను వైఎస్సార్ కల్పిస్తే చంద్రబాబునాయుడు కోర్టుకు వెళ్లి అడ్డుపడింది నిజం కాదా అని ప్రశ్నించారు. మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయ లబ్ధి, ఉనికిని కాపాడుకునేందుకే ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఉమ్మి సలీంపై ఫిర్యాదు

ఆదోనిఅర్బన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మైనార్టీ నాయకుడు ఉమ్మిసలీంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ నియాజ్‌అహ్మద్, మైనార్టీ నాయకులు మాబాషా, రహమాన్, హాజీ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. త్రీటౌన్ సీఐ నరసింహారాజు మాట్లాడుతూ ఫిర్యాదును పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

బొలెరో ఢీకొని తండ్రి, కుమార్తెకు తీవ్రగాయాలు

ఆస్పరి: మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు వద్ద సోమవారం స్కూటర్‌ను బొలెరో వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దేవనకొండ మండలం బుర్రకుంటకు చెందిన కృష్ణమూర్తి కూతురు చందన గీతను ఆలూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వదిలేందుకు వెళ్తుండగా ఆస్పరి నుంచి కర్నూలు వైపు అతి వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తండ్రి, కూతురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ వరప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మన్న ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. అక్కడ 108 వాహనంలోనే గాయపడిన వారికి డాక్టర్ బాలకృష్ణారెడ్డి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్తిబెళగల్‌కు బీటీ రోడ్డు

ఆలూరు: ఇచ్చిన హామీ మేరకు హత్తిబెళగళ్ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడంపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆలూరు మండల కేంద్రం నుంచి హత్తిబెళగళ్ గ్రామానికి 2.80 కి.మీ దూరం ఉంది. గ్రామానికి రోడ్డు సరిగా లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చేందుకు గ్రామస్తులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడేవారు. సమస్యను గ్రామస్తులు మంత్రి జయరాం దృష్టికి తెచ్చారు. కంకర వేసిన తర్వాత రోడ్డు పనులను కొంత కాలం పాటు వదిలేశారు. పనులు నిలిచిపోవడంతో గ్రామస్తులు మరోసారి మంత్రికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం పనులను పీఐయూ డీఈ భాస్కర్ సమక్షంలో ప్రారంభించారు.